ప్రజాశక్తి
సోమవారం 19 మే 2025 5 అనంతపురం



మహానాడు ట్రాన్స్‌పోర్ట్ కమిటీ సభ్యులుగా పూల నాగరాజు



ప్రజాశక్తి-అనంతపురం

తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి ట్రాన్స్‌పోర్ట్ కమిటీ సభ్యులుగా ఏపిఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో ఆంధ్రప్రదేశ్ నివాసులైన సీనియర్ సిటిజన్‌లకు ఇస్తున్న 25 శాతం రాయితీని రాష్ట్రంలో నడిపే అన్ని కర్ణాటక బస్సుల్లో కూడా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులను చిన్న చిన్న తప్పులకు కూడా సస్పెండ్ చేయడం, తొలగించడం వంటివి జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వానొచ్చి.. ఎండకు సెలవిచ్చి..!

ఉరవకొండ, రాయదుర్గంలో విస్తారంగా వర్షాలు
పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



కనేకల్ మండలంలో కురిసిన వర్షానికి సొల్లాపురం వద్ద ప్రవహిస్తున్న వంకలో చిక్కుకున్న వాహనాలు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాను వాన వీడలేదు. ఉదయం ఎండగా ఉన్నా రాత్రి అయ్యే సరికి వర్షం వస్తోంది. దీంతో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో ఆదివారం తెల్లవారుజామున విస్తారంగా వర్షాలు పడ్డాయి .ఆ ప్రాంతాల్లో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. కొన్నిచోట్ల రహదారులకు అంతరాయం ఏర్పడింది .ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బూదగవి వంక మరువ పారుతోంది. విడపనకల్లు– ఆర్.కొట్టాల, పెంచలపాడు– పొలికి, ఉరవకొండ – ఉండబండ, పాల్తూరు – మల్లాపురం గ్రామాల మధ్య ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కనేకల్లు మండలం రచ్చ మర్రి గ్రామంలో హనుమంతప్పకు చెందిన పశువులపాక పైకప్పు కూలడంతో మూడు దున్నపోతులు మృతి చెందాయి మరో రెండింటికి కాళ్లు విరిగాయి. సొల్లాపురం గ్రామంలో వంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. జిల్లావ్యాప్తంగా సగటున 33. 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా విడపనకల్లు మండలంలో 95.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవగా ఉరవకొండలో 89.2, వజ్రకరూరులో 86.2, బెలుగుప్ప లో 75.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. బొమ్మనహల్ లో 67.4, బ్రహ్మసముద్రం 56.4, గుంతకల్లు 52.4, గుమ్మగట్టలో 52.2. కనేకల్లులో 46.8, రాయదుర్గంలో 45.6, కనేకల్లులో 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

మరో నాలుగు రోజులు వర్ష సూచన

మరో నాలుగు రోజులు పాటు రాయలసీమ ప్రాంతంలో వర్ష సూచనలు ఉన్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్, ఆర్‌చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సాగుఅంచనా 3,43,232 హెక్టార్లలో ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. అయితే వేరుశనగ పంట 1.82 లక్షల హెక్టార్లలో సాగవుతుందని తక్కువగా అంచనా వేసి ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసే విత్తన వేరుశనగ కేటాయింపులు తగ్గించడం అన్యాయంగా ఉందన్నారు. విత్తన కేటాయింపులు పెంచి 90 శాతం సబ్సిడీతో వేరుశనగ, కందులు పంపిణీ చేయాలన్నారు. ఉలవ ఇతర ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. జిల్లాలో లక్షల ఎకరాల్లో సాగుతున్న వేరుశనగ పంటకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం సరఫరా చేస్తున్న విత్తన వేరుశనగ కీలకంగా ఉంటుందన్నారు. గత సంవత్సరం పంట చేతికి వచ్చే సమయంలో తీవ్ర నష్టం వాటిల్లిందని,పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో రైతుల అప్పుల్లో కూరుకుపోయారని అన్నారు. దీనివల్ల రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయన్నారు. విత్తనాల కోసం రైతుల నుండి రైతులు నేరుగా కొనుగోలు చేసుకునే అవకాశం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలే పంటకు మూలమవుతుందని చెప్పారు. ప్రభుత్వం వేరుశనగ కేటాయింపులు గత సంవత్సరం 76,710 క్వింటాళ్లు కేటాయించగా ప్రస్తుతం 54,184 క్వింటాళ్లు కేటాయించడంతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ప్రభుత్వం విత్తన కేటాయింపులు పెంచి జిల్లాలో కరువు పరిస్థితుల దృష్ట్యా 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

ఎరువులు, పురుగుల మందులు రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలన్నారు. ప్రతి పాసుపుస్తకానికి ఎకరాకు మూడు వేరుశనగ బస్తాలు ఇవ్వాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా ఇవ్వాలన్నారు. పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర విత్తనాలు, ఎరువులు పురుగు మందులు రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్ కు ముందే సమగ్ర ఉచిత పంటల బీమా ప్రకటించి అమలు చేయాలన్నారు. నాసిరకం, కల్తీ విత్తనాలు అరికట్టాలన్నారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేల రూపాయలు వెంటనే రైతుల ఖాతాలో ఒకేసారి జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగోన్నతుల్లో తిరకాసు..!

- ఉత్తర్వుల్లో సైతం దాటవేత ధోరణులు
- డిఆర్ పోస్టులో ప్రమోషన్లు
- మాన్యువల్ ఫైల్ గల్లంతు..!
- అడ్డగోలు వ్యవహారాల్లో చేతులు మారిన లక్షలు

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగోన్నతులోల అడ్డగోలు వ్యవహారం నడిచిందన్న చర్చ ఉద్యోగ వర్గాలలో సాగుతోంది. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి కాసుల కక్కుర్తి తో వ్యవహారం నడిపారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిపిన ఉద్యోగోన్నతుల వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ అడ్డగోలు ఉద్యోగోన్నతుల వ్యవహారంలో అర్బన్ ఎమ్మెల్యేకు సన్నిహితుడుగా ఉండే వ్యక్తి తెర వెనుక తతంగం నడిపినట్లు ఆరోపణలున్నాయి. అయితే ఈ వ్యవహారంలో కాసులు కక్కుర్తి పడే అధికారి ఉద్యోగోన్నతుల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు గురించి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చి ఉంటే ఈ వ్యవహారాలకు బ్రేక్ పడేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించమని ఎమ్మెల్యే చెప్పే అవకాశాలు ఉండవని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఉద్యోగోతుల్లో రెండు రకాల నిబంధనలు పాటించాల్సి ఉంటుందని అధికావర్గాలు చెబుతున్నాయి. ఒక పోస్టు రికార్డ్ అసిస్టెంట్ లేదా అటెండర్లు లేదా ఇతర స్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించే అంశంలో సీనియారిటీని బట్టి రోస్టర్ ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుంది. మరో పోస్టు డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కు కేటాయించాల్సి ఉంటుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు రోస్టర్ పాయింట్ మరో విధంగా ఉంటుంది. రికార్డు అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు కల్పించే విషయంలో రోస్టర్ తో పాటు సీనియారిటీ లిస్టును కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇవేవీ పట్టించుకోకుండా 'పంక్తిలో కూర్చున్న వారు తమ వారైతే ఎక్కడ కూర్చున్నా ఫలాలు అందించాల'న్న ధ్యేయంతో అధికారులు వ్యవహరించినట్లు విమర్శలున్నాయి. సీనియార్టీలో ముందు వరుసలో ఉన్న వారిని వెనక్కు నెట్టి మధ్యలో ఉన్నవారికి రోస్టర్ పాయింట్‌ను సైతం పక్కనపెట్టి కాసులు కక్కుర్తితో ఉద్యోగోన్నతి కల్పించారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. అయితే కాసుల మత్తులో జోగుతూ సీనియారిటీకి తిలోదకాలు ఇవ్వటమే కాక రోస్టర్ ను సైతం తుంగలో తొక్కినట్లు తెలుస్తోంది. గతంలో టిఆర్ పోస్టులో కారుణ్య నియామకం కింద ఒకరిని జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. అలాగే రికార్డ్ అసిస్టెంట్‌కు ఉద్యోగోన్నతి కల్పించి జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. ప్రభుత్వం నియామకాలు చేపట్టినప్పుడు కారుణ్య నియామకాలు కింద అర్హత కలిగిన వారిని జూనియర్ అసిస్టెంట్ గా నియమించాల్సి ఉంటుంది. అయితే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ పోస్ట్ కింద జరపాల్సిన నియామకం స్థానంలో ఓ రికార్డు అసిస్టెంట్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించారని తెలుస్తోంది. ఉద్యోగోన్నతులు కల్పించే అంశంలో లక్షల రూపాయలు పైగా చేతులు మారినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని కప్పిపుచ్చుకోవటానికి జారీ చేసిన ఉద్యోగోన్నతుల వ్యవహారంలో పొందుపరిచిన అంశాలను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ ఉద్యోగోన్నతుల వ్యవహారంలో ఒక అధికారి వ్యవహరించిన తీరు చూస్తుంటే ఇంత బరితెగింపా అన్న సందేహం కలుగుతుంది. మొత్తం ఉద్యోగోన్నతుల వ్యవహారానికి సంబంధించిన మాన్యువల్ ఫైల్ సైతం కనిపించకపోవడం మరో వింతగా కన్పిస్తోంది. సాధారణంగా ఉద్యోగోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులలో రోస్టర్ పాయింటును తప్పనిసరిగా ప్రకటించి నిబంధనలకు లోబడి సంబంధిత ఉద్యోగికి ప్రమోషన్ కల్పించటం రివాజు. ఉద్యోగ వర్గాలలో జరుగుతున్న చర్చకు తగ్గట్టుగానే కమిషనర్ డిజిటల్ సైన్‌తో వెలువరించిన ఉత్తర్వుల్లో సైతం స్పష్టత కొరవడింది. ఉద్యోగి సీనియార్టీ జాబితా, రోస్టర్ బట్టి కల్పించే ప్రమోషన్‌లో నిబంధనలు పాటిస్తూ ఇచ్చే ఉత్తర్వులలో స్పష్టత ఉండాల్సింది. అయితే ఏవైనా అభ్యంతరాలు ఆడిట్లో కాని ప్రభుత్వం నుంచి కానీ హైకోర్టు నుంచి కానీ ఎవరైనా వ్యక్తిగతంగా ఎదురైతే ఎలాంటి ముందస్తు నోటీసు, సమాచారం ఇవ్వకుండానే ప్రమోషన్ నుంచి డిమోషన్ ఇస్తూ ఆ ఉద్యోగి ఒరిజినల్ పోస్టుకు పంపడం జరుగుతుందని స్పష్టంగా పేర్కొన్నారు ఇదిలా ఉండగా ఉద్యోగికి ప్రమోషన్‌కల్పించే విషయంలో స్పష్టమైన రోస్టర్ పాయింట్‌ను కనబరచకుండా 20 ఏళ్ల క్రితంఉద్యోగోన్నతుల సమయంలో వ్యవహరించిన ఉదంతాలను పేర్కొంటూ ఇప్పుడు కూడా అప్పటిలాగే వ్యవహరిస్తున్నట్లుగా పేర్కొంటూ ప్రమోషన్ల ఉత్తర్వులలో డ్రాఫ్టింగ్ చేశారు. నియామక ఉత్తర్వులు జరిపే సమయంలో పాటించాల్సిన నిబంధనలకు విరుద్ధంగా సాగిన ఉద్యోగోన్నతుల వ్యవహారం పై సమగ్ర విచారణ జరిపితే అడ్డగోలు అక్రమ వ్యవహారాలు వెలుగు చూస్తాయని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి ఈ అడ్డగోలు ఉద్యోగుల ప్రమోషన్ల వ్యవహారంపై కలెక్టర్, అర్బన్ ఎమ్మెల్యే స్పందించి సమగ్ర విచారణ జరిపిస్తే ఆ అధికారి అక్రమ కార్యకలాపాలు, అవినీతి వెలుగు చూస్తాయని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కాసులు కక్కుర్తి తో ఉద్యోగ వర్గాలను వేధింపులకు గురి చేసే ఆ ఉద్యోగిపై విచారణ జరిపి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని ఆ వర్గాలు కోరుతున్నాయి.



అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం

పోలీసుల సమక్షంలో నారాయణరెడ్డి దంపతుల అంత్యక్రియలు

ప్రజాశక్తి-రాప్తాడు

మండల కేంద్రంలో హత్యకు గురైన నారాయణరెడ్డి దంపతుల అంత్యక్రియలు ఆదివారం పోలీసుల సమక్షంలో జరిగాయి. భూ తగాదాల విషయంలో శనివారం రాప్తాడులో నారాయణరెడ్డి, భార్య ముత్యాలమ్మను వేట కొడవళ్లతో నరికి చంపిన విషయం తెలిసిందే. ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతిచెందగా నారాయణరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈనేపథ్యంలో ఆదివారం ఇద్దరి మృతదేహాలను రాప్తాడులో ఉన్న నివాసానికి తీసుకొచ్చారు. దీంతో కొద్దిసేపు ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మృతదేహాలను కొద్దిసేపు స్వగృహంలో ఉంచారు. నారాయణరెడ్డి దంపతుల మృతదేహాలను చూసేందుకు బంధువులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. రాప్తాడులో భారీ పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా మాజీ ఎమ్మెల్యే సోదరుడు రాజారెడ్డి, ఎంపిపి భర్త సత్తిరెడ్డి, తదితరులు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల సమక్షంలో నారాయణరెడ్డి స్వగ్రామం గొల్లపల్లికి మృతదేహాలను తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.



నారాయణరెడ్డి దంపతుల మృతదేహాలు

ఎన్నిక (అ)టెక్షన్

నేడు కదిరి మున్సిపల్ చైర్మన్, గాండ్లపెంట, రామగిరి ఎంపిపి ఎన్నిక
కదిరి, గాండ్లపెంటలో టిడిపి పైచేయి - రామగిరిలో ఉత్కంఠ
ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంది. సోమవారం కదిరి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికతో పాటు గాండ్లపెంట, రామగిరి మండలాల్లో ఎంపిపి ఎన్నిక జరుగనుంది. ఈ మూడు చోట్ల వైసిపికి చెందిన వారే అధికారంలో ఉండేవారు. సాధారణ ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ సమీకరణాలు మారాయి. ఈ నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఆమె పదవీచ్యుతురాలైంది. దీంతో ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. అలాగే గాండ్లపెంట ఎంపీపీ జగన్మోహన్ రాజీనామాతో అక్కడ ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. దీంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికలు సోమవారం నిర్వహించనున్నారు. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా ఇటీవల వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు టీడీపీ గూటికి చేరారు . దీంతో టీడీపీకి 25 మంది కౌన్సిలర్లు ఉండగా వైసీపీకి 11 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎవరు ఎన్నిక అవుతారన్న చర్చ పట్టణంలో సాగుతోంది. టిడిపి గూటిలో ఉన్న 25 మంది కౌన్సిలర్లు బెంగళూరు క్యాంపులో ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకి కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో నేరుగా మున్సిపాల్టీ కి చేరుకోనున్నారు. ఇదిలా ఉండగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికను వైసీపీ బహిష్కరించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఛైర్ పర్సన్ పోటీకి ఎక్కువగా పోటీ నెలకొనడంతో మున్సిపల్ ఛైర్ పర్సన్ వైస్ ఛైర్మన్‌ల అభ్యర్థుల ఎంపిక కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కౌన్సిలర్లతో విడివిడిగా మాట్లాడి అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక కూడా సోమవారం నిర్వహించనున్నారు. ఈ స్థానాన్ని కూడా టిడిపి వర్గీయులే చేజిక్కించుకోనున్నారు. ఇక రామగిరి ఎంపిపి ఎన్నిక ఉత్కంఠత రేపుతోంది. ఆ స్థానాన్ని ఎవరు చేజిక్కుంచుకుంటారన్నది సోమవారం తేలనుంది.



కదిరి మున్సిపల్ కార్యాలయం

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి



ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారుడు తన కుటుంబ సభ్యులందరితో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతినెల సబ్సిడీతో నిత్యావసర వస్తువులు ఆయా చౌక దుకాణాల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం త్వరలో గతంలో ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనుంది. రేషన్ కార్డులో ఉన్న సభ్యులు అందరూ ఐదేళ్ల పైబడిన వారు 80 ఏళ్ల వయసు లోపల ఉన్నవారు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎవరైతే ఈకేవైసీ చేయించుకోరో ఆ సభ్యులకొచ్చే నిత్యావసర వస్తువులలో కోత పడుతుందని ప్రభుత్వం హెచ్చరించింది. ఇంకా ఈకేవైసీ చేయించుకొని వారికోసం ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు విధించింది. అలాగే చాలాచోట్ల మారుమూల గ్రామాల్లో ప్రజలు నిత్యావసర వస్తువులు పొందాలంటే సర్వర్ పని చేయక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు సరఫరా చేసే వాహనాలు (ఎం డి యు) కొన్ని గ్రామాలకు నిలిచివేయబడ్డాయి. దీంతో డీలర్ ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర వస్తువులు తీసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : జిల్లా లో ఎన్ని చౌక దుకాణాలు ఉన్నాయి? ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి? స్టాక్ పాయింట్లు ఎన్ని, ఎక్కడెక్కడ ఉన్నాయి?

జవాబు : జిల్లాలో మొత్తం 1367 చౌక దుకాణాలు ఉన్నాయి. 5,66,057 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం సభ్యులు 16,89,531 మంది ఉన్నారు. జిల్లాలో స్టాక్ పాయింట్లు 12 ఉన్నాయి. ఇవి ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, ముదిగుబ్బ, కదిరి, గాండ్లపెంట, తనకల్లు, బుక్కపట్నం, ఓడి చెరువు, గోరంట్ల, పెనుకొండ, హిందూపురం, మడకశిరలో ఉన్నాయి. ప్రతి నెల డీలర్లు 20వ తేదీ లోపు డీడీలు చెల్లిస్తే వారికి స్టాక్ పాయింట్ల ద్వారా ఒకటవ తేదీ లోపల నిత్యవసర వస్తువులు సరఫరా చేయబడతాయి.

ప్ర : ప్రతినెల బియ్యం, ఇతర సరుకులు ఎన్ని క్వింటాళ్లు పంపిణీ చేయబడుతున్నాయి?

జ : కొన్ని డిపోలలో ఒక్కొక్కసారి సరుకులు మిగిలిపోతుంటాయి. దీనినే బఫర్ స్టాక్ అంటాం. ఆ బఫర్ స్టాక్ మినహాయించి సరుకులు డీలర్‌కు ఇవ్వడం జరుగుతుంది. గత నెల ఏప్రిల్ లో పంపిణీ చేసిన వివరాల మేరకు 86,00,172 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేశాం. బియ్యంతో పాటు చక్కెర, ఒక్కోసారి స్టాకును బట్టి కంది బేడలు, బట్టల సబ్బులు, సర్ఫ్ పొడి, పంపిణీ చేయడం జరుగుతుంది.

ప్ర : డీలరు ఎన్ని రోజుల వరకు సరుకులు ఇవ్వవచ్చు? సరుకులు లబ్ధిదారులు తర్వాతి నెలలో తీసుకోవచ్చా? ఎక్కడైనా సరుకులు తీసుకోవచ్చా?

జ : ప్రతినెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారు. ఒక నెలలో సరుకులు తీసుకొని లబ్ధిదారులు తర్వాతి నెలలో తీసుకోవడానికి వీలు లేదు. ఏ నెలలో సరుకులు ఆ నెలలోనే తీసుకోవాల్సి ఉంటుంది. రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుడు జిల్లాలో ఎక్కడైనా చౌక ధాన్యపు డిపోలలో తీసుకొని అవకాశం ప్రభుత్వం కల్పించింది.

ప్ర : మారుమూల గ్రామాల్లో సర్వర్ సమస్య ఉంది? వాటికి పరిష్కారం ఏమిటి?

జ : మారుమూల గ్రామాల్లో అక్కడక్కడ సర్వర్ సమస్య ఎదురవుతున్న మాట వాస్తవమే. వాటి పరిష్కారంగా ఆఫ్ లైన్ పద్ధతిలో పంపిణీ చేసి అనంతరం ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుంది. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సరుకుల పంపిణీ జరుగుతోంది.

ప్ర : జిల్లాలో గ్రామాలకు సరుకులు చేరవేసే ఎం డి యు వాహనాలు ఎన్ని? అవి అన్ని పని చేస్తున్నాయా?

జ: జిల్లాలో మొత్తం 349 ఎండియు వాహనాలు ఉన్నాయి. వాటిలో 259 పర్మినెంట్ వాహనాలు. 39 తాత్కాలిక వాహనాలు ఉన్నాయి. ప్రస్తుతం 298 మాత్రమే పనిచేస్తున్నాయి. వాహనాల ద్వారా పంపిణీ చేయలేని పరిస్థితులలో డీలర్ నెలకొల్పిన చౌక ధాన్యపు డిపో నుంచి లబ్ధిదారులు సరుకులు తీసుకోవచ్చు.

ప్ర : కొంతమంది డీలర్లు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి? అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జ : డీలర్లు అవినీతి అక్రమాలు చేస్తున్నారని ఆరోపణలు తమ దృష్టికి వస్తే విచారణ చేపట్టి అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు రుజువు అయితే 6 ఎ క్రింద కేసు నమోదు చేసి డీలర్ ను విధుల నుంచి తొలగిస్తాము. తరువాత నియమించే డీలర్ కు తగిన సూచనలు ఇస్తూ ఎలాంటి అవకతవకలకు పాల్పడకూడదని హెచ్చరికలు చేస్తాం.

ప్ర : సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సూచనలు సలహాలు ఏమిటి?

జ : సిబ్బంది కొరత లేదు. ఈకేవైసీ చేయించుకొని వారు వెంటనే ఆయా డీలర్ల దగ్గరకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలి. ఇంకా ఈ కేవైసీ చేయించుకోని వారు 99,872 మందిఉన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే వారికి వచ్చే రేషన్ కోతపడుతుంది. ఈ విషయాన్ని గమనించి లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులందరికీ ఈకేవైసీ చేయించాలి. ప్రతినెల 1వ తేదీ నుంచి 17వ తేదీ లోపల లబ్ధిదారులు సరుకులు తీసుకోవాలి. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చు.



వంశీకృష్ణారెడ్డి

ఎన్నికల హామీల అమలుకు డిమాండ్


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-పామిడి

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక, సిఐటియు నాయకులు డిమాండ్‌చేశారు. ఆదివారం స్థానిక సిపిఎంకార్యాలయంలో ఏపి కౌలు రైతు సంఘం రైతు సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో హామీ మేరకు పంటలకు మద్దతు ధర కల్పించాలని, రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయం అందించాలని, నూతన కౌలు చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకం నిధులు పెంచి ప్రతి కూలీకి పని కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను రద్దు చేయకుండాఉన్న హక్కులనే అమలు చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసనలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శివకుమార్, ఏపి రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్‌రెడ్డి, ముత్యాలు, నరసింహులు, లక్ష్మీనారాయణరెడ్డి, దస్తగిరి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పదో తరగతి 2025-25 విద్యా సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని దళిత, గిరిజన విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం ఎన్జీఓ హోంలో అసోసియేషన్ అధ్యక్షులు కటిక జయరామ్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డిటి ఛైర్మన్ తిప్పేస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ సుబ్బరాయుడు, మాజీ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ప్రకాష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిలో స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పే బ్యాక్ టు ద సొసిటీ ద్వారా ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రైజ్ మనీ శాలువా ప్రశంసా పత్రాలను షీల్డ్ యిచ్చి ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజా రమేష్, ఉపాధ్యక్షులు శాంతిముని మృషికేష్, కోశాధికారి లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శి అంజనేయులు, కేశవయ్య, మనోహర, నరసింహులు, శాంతి స్వరూప్, పుల్లయ్య, రామంజినమ్మ, విజయకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవో 523ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం



విలేకరులతో మాట్లాడుతున్న ఎపిజిఇఎ నాయకులు

జీవో 523ని వెంటనే రద్దు చేయడంతోపాటు ప్రమోషన్ ఛానల్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హేతుబద్ధీకరణ ప్రక్రియపై ఉద్యోగులు అనేక అనుమానాలతో భయాందోళనకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా మిగులు ఉద్యోగులను ఎక్కడ కేటాయిస్తారో తెలియక సందిగ్నంలో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులు ఆశిస్తున్న సరైన ప్రమోషన్ ఛానల్, సర్వీస్ రూల్స్‌ను ఏర్పాటుచేసి మిగులు ఉద్యోగులను ప్రమోషన్ల ద్వారా ఆయా మాతృశాఖలో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుఎఎస్ఎ జిల్లా కోశాధికారి సాయితేజ, సాకే రామాంజనేయులు, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్


నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

జిల్లాలోని పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకుందామని రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్ పిలుపునిచ్చారు. ఆర్డీటీ సంస్థలకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటర్ యాక్టు (ఎఫ్‌సిఆర్‌ఎ)ను పునరుద్ధరించాలని కోరుతూ ఆదివారం పట్టణంలో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా స్థానికా ఆర్డీటీ ఆసుపత్రి వద్ద ఉన్న ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సారథ్యంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు జిల్లా పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబుకు విన్నవించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం గౌరవాధ్యక్షులు చల్లా రాజశేఖర్, ఓబుళరాజు, సీనియర్ జెర్నలిస్టు లింగప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, సెక్రటరీ తిప్పేస్వామి, వెటర్నరీ మల్లికార్జున, నారాయణ, జనసేన రూహుళ్ల, ప్రజాశక్తి రఘు, రోజ్లీ, సోము, బాబా దొనతిమ్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు కల్పన, భగవాన్ దాస్, విజయ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బినామీ స్వరూపాన్ని బయటపెట్టిన గ్యాస్ నిర్వాహకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో బినామీ ఎవరూ అనే విషయాలను నిర్వాహకురాలు ఎద్దుల సరస్వతి వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో తన కుమారుడు ఆదిత్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడ ఏజెన్సీ రావాలంటే జెసి దివాకర్‌రెడ్డి పుణ్యమన్నారు. అలాంటి కుటుంబంపై బినామీగా వ్యవహరిస్తున్న ఎద్దుల సూర్యప్రభాకర్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. తమ కుటుంబానికి ఎలాంటి ఆస్తులు పంచకుండా ఏజెన్సీనే లేకుండా చేయాలని కుట్రతో మమ్ములను బికారీలుగా చేసేందుకు ఇతను కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఏజెన్సీపై తనకు సర్వహక్కులు ఉంటుండగా అతనే బినామీగా వ్యవహరించి తమను బినామీగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసమన్నారు. తన భర్త శివప్రసాద్‌రెడ్డికి రావాల్సిన కుటుంబ ఆస్తులను పంచి ఇవ్వాలని అడుగ్గా గ్యాస్ ఏజెన్సీ రాసివ్వాలని కోరాడని.. ఇవన్నీ అడగటం తప్పా అంటూ ప్రశ్నించారు. తన భర్త పామిడిలో బతికున్నప్పుడు తీసుకున్న స్థలంపై కూడా సూర్యప్రభాకర్‌రెడ్డి కన్ను పడిందని వాటిని కాజేయాలని పన్నాగం పన్నాడని ఆరోపించారు. తమకు ఎలాంటి హాని జరిగినా సూర్యప్రభాకరరెడ్డి బాధ్యత వహించాలని కోరారు.

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION :: GOOTY
Suceession O.P. No:2/2025

Between:
S.RAVI SHANKAR ...PETITIONER
And
NIL ...RESPONDENTS

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా పై తెలిపిన అర్జీదారుడు తన తండ్రి యస్.ఉదయ్ కుమార్ తిమ్మనచెర్ల పోస్టాఫీసు, గుంతకల్లు నందు అకౌంటు నెం.020057382986 నందు రూ.10,00,000/- (పది లక్షల రూపాయలు మాత్రమే) డిపాజిట్ చేసి తదుపరి 14-08-2024వ తేదిన మరణించినందున మరియు అతని తల్లి గారు 04-09-2024వ తేదిన మరణించినందున, అర్జీదారుని తన తండ్రి యొక్క వారసుడిగా ప్రకటించి పై మొత్తమును తీసుకొనుటకుగాను ఉత్తర్వుల కొరకు పై కోర్టు నందు పై అర్జీని దాఖలు చేసి వున్నాడు. కావున ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలున్న యెడల 16-07-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పై కేసు అర్జీదారుని పరమున తీర్మాణించబడునని
తెలియజేయడమైనది.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

వాయిదా:16-07-2025

మాదినేని రవిశంకర్,
గుంతకల్లు.
పాటిల్ చంద్రకాంత రెడ్డి,
గుత్తి,
అర్జీదారుని పరం న్యాయవాదులు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

రైతు, వ్యకాసం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు


పోస్టర్లను విడుదల చేస్తున్న రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల నాయకులు

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు ఆదివారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో ఎన్నికల సందర్భంగా తమకు అధికారం ఇస్తే అన్ని పంటలకు మద్దతు ధర కల్పిస్తామని అప్పట్లో ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్నారు. అయితే కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చినా రైతులను పట్టించుకోలేదన్నారు. అంతేగాకుండా మోదీ ప్రభుత్వం అనుసరించిన రైతు వ్యతిరేక విధానాలతో గడిచిన పదేళ్లలో 4 లక్షల మందికిపైగా రైతులు, కూలీలు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీల గుప్పెట్లోకి మార్చేందుకు మోదీ పూనుకున్నారన్నారు. ఇందులో భాగమే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చేందుకు పూనుకుందన్నారు. అయితే భారత రైతాంగం 13 నెలలకుపైగా అశేష త్యాగంతో విరోచితంగా పోరాడి మోదీ మెడలు వంచారన్నారు. రూ.2లక్షల వరకూ రైతులకు పెట్టుబడి సాయం పెంచాలన్నారు. ఇకపోతే రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేల అన్నదాత పెట్టుబడి సాయాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. మిర్చి, పొగాకు, చీనీ, అరటి, పత్తి, మినుములు, జొన్నలు, కందులు, శనిగలు, టమోటా, ఉల్లి వంటి పంటలకు మద్దతు ధర చట్టం అమలు చేయాలన్నారు. జిల్లాలో ఆర్డీటీ సేవలు నిలిచిపోకుండా ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధణకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజులకు రూ.600 పెంచడంతోపాటు సంవత్సరానికి 200కు పెంచాలన్నారు. పనులు చేసేచోట కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో హంద్రీనీవా కాలువను పదివేల క్యూసెక్కులకు సామర్థ్యం వెడల్పు చేసి పిల్లకాలువలకు నీరు వదలాలన్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా సూరి సంఘం మండల కార్యదర్శిటి పెద్దయ్యసిఐటియు రాఘవరెడ్డివెంకట చౌదరి, రైతు సంఘం నాయకుడు భాస్కర్ రెడ్డి, జే పెద్దయ్య ఆదినారాయణ,రంగప్ప నాగముని తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్యాక్సీ కార్మికుల ఉపాధికి గండి కొడితే సహించం

సిఐటియు నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి-గుంతకల్లు


టౌన్ రైడర్ యాప్ పోస్టర్లను దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

టౌన్ రైడర్ యాప్ రూపంలో ట్యాక్సీ, ఆటో కార్మికుల ఉపాధికి గండి కొట్టాలని చూస్తే ఊరుకునేది లేదని సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు వీరేష్, హరి, మోహన్, హరి హెచ్చరించారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ కూడలిలో వేసిన టౌన్ రైడ్‌యాప్ ఫ్లెక్సీలను చింపి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, టాక్సీలపై ఆధారపడి పట్టణంలో సుమారు 5వేల మందికిపైగా కార్మికులు జీవిస్తున్నారన్నారు. ఓ పక్క ప్రభుత్వాలు కొత్త నిబంధనల పేరుతో ఆటో రంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు కొనసాగిస్తుంటే.. మరోపక్క ప్రయివేట్ సంస్థ టౌన్ రైడర్ పేరుతో ఆటో కార్మికుల పొట్ట కొట్టేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఆటో, ట్యాక్సీ కార్మికులు, ఉపాధి కోల్పోవడానికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఉపాధి మార్గాలు లేక విద్యావంతులైన నిరుద్యోగులు ఆటో కార్మికులుగా మారి స్వయం కృషితో ఆటోలను ఫైనాన్స్‌ల్లో తెచ్చుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఇలాంటి కీలక రంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయివేటు కంపెనీలు ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. ఒకవైపు బాడుగలు లేక, తెచ్చుకున్న ఆటోలకి ఫైనాన్స్ వారికి కంతులు కట్టలేక, కుటుంబాలను పోషించుకోలేక ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టౌన్ రైడర్ అనే దోపిడి సంస్థ రావడం బాధాకమరన్నారు. వెంటనే ఈ యాప్‌ను రద్దు చేయాలని.. లేకుంటే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌కెఎం బాషా, రాజేష్, వెంకీ, బాబీ, ఆటో కుమార్, గాదిలింగ, బుల్లెట్ సీన, రవి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు..

ప్రజాశక్తి-అనంతపురం సిటీ


ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి అనుపమ

హెచ్ఐవితో జీవిస్తున్న వ్యక్తులపై వివక్షను రూపుమాపాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ జివి రమణ, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, రిడ్స్ క్రిష్టప్ప, అనంత నెట్వర్క్ రామాంజనేయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


రాయదుర్గం : అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మాస్ ఎడ్యుకేషన్ సంస్థ, ఐసిటిసి విభాగం, ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ సాయి, హెడ్‌నర్స్ పార్వతి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఏరియా ఆసుపత్రి స్టాఫ్‌నర్స్ గీత, రేఖ, దివ్య, మారెప్ప, శివన్న, ఔట్రీచ్ వర్కర్స్, పీర్ ఎడ్యుకేటర్స్ పాల్గొన్నారు.

తాడిపత్రి : అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి అశోక్ పిల్లర్ వరకూ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ శివశంకర్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ సునీల్, మాస్ ఎడ్యుకేషన్ ఆర్గనైజషన్ పియు.2 తాడిపత్రి ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథ్‌రెడ్డి, ఎంఇఎ సుధాకర్, ఎఎన్ఎం విజయలక్ష్మి, ఒఆర్‌డబ్ల్యూ హామీదా, హాజరా, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో పెనుగొండ మండలం సోమందేపల్లి గ్రామానికి చెందిన కామాక్షికి ఆర్థికసాయం అందజేశారు. కామాక్షి బోన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈమె భర్త రోజు కూలీగా మగ్గం పని చేసి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నాడు. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి, ట్రస్టు సభ్యులు రామ్మోహన్‌రెడ్డి, సతీమణి కవిత, మేనల్లుడు ప్రవాస భారతీయులు పెద్దిరెడ్డితో కలిసి రూ.6500 సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నిర్మలమురళి, ట్రస్టు సభ్యులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జెవివి నాయకురాలు డాక్టర్ పి.ప్రసూన

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

జెవివి నాయకురాలు డాక్టర్ పి.ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాబోయేది వర్షాకాలం కానుందున మూర్ఛవ్యాధి రోగులు ఆరోగ్యంపై తగు జాగ్రత్తగా ఉండాలని జెవివి నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన సూచించారు. జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రతినెలా మూడో ఆదివారం నిర్వహించే మూర్ఛవ్యాధి శిబిరాన్ని ఆదివారం గిల్డాఫ్ సర్వీస్ హై స్కూల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయానికి అనుగుణంగా మాత్రలను తప్పనిసరిగా వాడాలన్నారు. ముఖ్యంగా మూర్ఛ వ్యాధి రోగులు తమ ఆరోగ్యం పట్ల ఎల్లప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శిబిరం కన్వీనర్ రామకృష్ణ, డాక్టర్ హరికిషోర్, జెవివి నగర అధ్యక్షులు ఎం.రామిరెడ్డి, నాయకులు టీచర్ నాగరత్నమ్మ, తిరుపాల్, ముత్యాలు, ప్రసాద్‌రెడ్డి, ఎర్రిస్వామి, రాధాకృష్ణ, నూర్ మహమ్మద్, శివ చరణ్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

'స్వరా' ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం


'స్వరా' ఆసుపత్రి ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురంలోని మారుతీ నగర్‌లో నూతనంగా నిర్మించిన స్వరా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అనంతపురం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో నూతన హంగులు, అత్యాధునిక పరికరాలతో ఆసుపత్రిని ప్రారంభించినట్లు చెప్పారు. 58 పడకలు, పూర్తిస్థాయి కార్డియాక్ వైద్య సేవలతో పాటు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సభ్యులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, విప్ కాలవ శ్రీనివాసులు ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, సింధూరారెడ్డి, సిరి ఆసుపత్రి డాక్టర్ రాంప్రసాద్, ఐఆర్ఎస్‌యు డివిజినల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, చీఫ్ మెడికల్ గుంతకల్లు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి దేవి, ట్రాన్స్‌కో ఎస్ఇ శేషాద్రి శేఖర్, డిఎఫ్ఒ శ్రీనివాసరెడ్డి, వికె బిల్డ్ టెక్ అధినేత వంశీ ఏటూరి, సీనియర్ జనరల్ సర్జన్ ఎండి నాయక్, గైనకాలజిస్టు డాక్టర్ శ్వేత, పలువురు ప్రముఖ వైద్యులు, పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జేమ్స్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు బిసిఆర్.దాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దళిత బిటెక్ విద్యార్థి జేమ్స్‌పై అమానుషంగా దాడి చేసి అత్యాయత్నం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు బిసిఆర్.దాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి విద్యార్థికి న్యాయం చేయాలన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో ఉన్న కాలేజీలో బీటెక్ చదువుతున్న జేమ్స్‌పై దాడి చేసి అమానుషంగా, అమానవీయంగా ప్రవర్తించి, కులం పేరుతో దూసిస్తూ చిత్ర హింసలకు గురిచేసిన యశ్వంత్, రూపేష్, చోటా, కిరణ్, జగ్గా, నానిలను వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో దళితుల జోలికి ఎవరైనా రావడానికి భయపడే విధంగా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

సాంబశివారెడ్డికి సింగపూర్‌లో ఘన స్వాగతం

శింగనమల : ఎన్ఆర్ఐ గ్లోబల్ కనెక్ట్ పర్యటనకు వెళ్లిన వైసిపి ఎన్ఆర్ఐ విభాగ గ్లోబల్ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డికి సింగపూర్‌లో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆపార్టీ నాయకులు బొకేలు అందజేశారు. అనంతరం పార్టీ కార్యక్రమాలు, పరిస్థితులపై చర్చించారు.

కామ్రేడ్ సుందరయ్యకు నివాళి

ప్రజాశక్తి-తాడిపత్రి


సుందరయ్యకు నివాళులర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న రైతుసంఘం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల మన్ననలు పొందారని గొప్ప నాయకుడని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటం, గాంధీ గారితో కలిసి చేసిన ఉప్పు సత్యాగ్రహం లాంటి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన చేసిన త్యాగం, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని అనేక ఉద్యమాలు భవిష్యత్తులో కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జయశేఖర్‌రెడ్డి, ప్రజాశక్తి ఆది, శేషు, గౌరి, నందిని, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనంతపురం : సాక్ష్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రోటరీ పబ్లిక్ స్కూల్లో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం ప్రభుత్వ ఆయుర్వేదిక డాక్టర్ రామకుమార్ మాట్లాడుతూ సాక్ష్యం ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కంటి వైద్యాన్ని అందించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని, అరుణ్, చైతన్య, సువర్ణాదేవి, సుగుణ, ఓబిరెడ్డి, హనుమేష్, తదితరులు పాల్గొన్నారు.

బద్దేనాయక్ సేవలకు గవర్నర్ ప్రశంస

కళ్యాణదుర్గం రూరల్ : ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు. జెఎన్‌టియులో నిర్వహించిన స్నాతకోత్సవాన్ని ముగించుకున్న గవర్నర్ నూతన వధూవరులైన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె చరిత, అల్లుడు రాహుల్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బద్దేనాయక్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే అమిలినేని గవర్నర్‌కు వివరించారు. దీంతో బద్దేనాయక్ సేవలను ప్రశంసిస్తూ గవర్నర్ అభినందించారు.

ఎక్సైజ్ సిఐపై ఫిర్యాదు

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గంలో ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేస్తున్న పూర్ణసాయి (నాని)పై చెప్పుతో దాడి చేసిన ఎక్సైజ్ సిఐపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిఐ యువరాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బాధితుడి తల్లితండ్రులు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మల్లికార్జున, యోగానంద, నూతిమడుగు తిమ్మప్ప, రవి, బిజెపి నాయకులు ముప్పాళ్ల దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టం జిల్లా అధ్యక్షుడిగా ఎంసి బాలన్న


నియామకపత్రం అందుకుంటున్న బాలన్న

అనంతపురం రూరల్ : సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులుగా ఎంసి బాలన్న నియమతులయ్యారు. ఆదివారం సమాచార హక్కు చట్టం ఐక్యవేదిక కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు లాల్యానాయక్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముందుగా యుద్ధవీరుడు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్ఆర్‌సిఎను వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు లాల్యానాయక్, జిల్లా అధ్యక్షులు బాలన్న, రాష్ట్ర కోశాధికారి రాజా మల్లికార్జున, జిల్లా గౌరవాధ్యక్షులు కొట్టాల సురేష్, దిన్నే శరత్‌బాబు, ఆనంద్, షమీవుల్లా, నగర కమిటీ అధ్యక్షుడు చంద్రమహేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

20న హుండీ లెక్కింపు

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని ఈనెల 20న లెక్కించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపులో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులైన తెల్లపంచ, కండువా మాత్రమే ధరించి హాజరుకావాలని సూచించారు.

అశ్వవాహనంపై వెంకటేశ్వరస్వామి

రాయదుర్గం : పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు అశ్వ వాహనోత్సవంపై విహరించారు. ముందుగా వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో రాయదుర్గం తాలూకా రెడ్డిసంఘం, ఆరెకటిక, నాయీబ్రాహ్మణ, ఈడిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోతుల బెడదను అరికట్టండి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని కోతులు బెడదను అరికట్టాలని వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైల్వే స్టేషన్ చుట్టూ కోతులు అధికంగా సంచరిస్తున్నాయని వాటివల్ల ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ప్రయాణికుల విలువైన వస్తువులు, సెల్ ఫోన్లు, తినుబండారాలను లాకెళ్తున్నాయని చెప్పారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణికులు లగేజీతో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అలాగే పలువార్డుల్లో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడికి దిగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి కోతులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిట్టా రూపకళకు పిహెచ్‌డి



అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం కెఎస్ఆర్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న చిట్టా రూపకళకు తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసింది. ఇంగ్లీష్ లిటరేచర్‌లో ప్రొఫెసర్ వైయస్ శారద పర్యవేక్షణలో కట్టింగ్ ద గార్డియన్ నాట్ ద సెలెక్టెడ్ నావెల్స్ ఆఫ్ మంజుకపూర్, చిత్ర బెనర్జీ దివకారుని అండ్ కవిత దాస్వాని ఏ స్టడీ అనే అంశంపై చిట్టా రూపకళ పరిశోధన చేశారు. ఒక మహిళ తనకు వచ్చే సమస్యల్ని ధైర్యంగా ఎంత సంకల్ప బలంతో పరిష్కరించుకుంటుందో మంజు కపూర్, చిత్ర బెనర్జీ దివకారుని, కవితాదాస్వాని నవలలు ఆధారంగా పరిశోధన చేశారు. ఇందుకు యూనివర్సిటీ ఆమెకు పిహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసింది.

నేరాలు ఘోరాలు

యువకుడు దారుణహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ జయనాయక్

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని కొంతానపల్లి గేట్ సమీపంలో వినోద్‌కుమార్ (22) దారుణహత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న రాయదుర్గం అర్బన్ సిఐ జయనాయక్ ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పరిశీలించి చూస్తే యువకుడి గొంతు కోసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మృతుడు రాయదుర్గంలో గార్మెంట్స్ పనికి వెళ్లేవాడని గ్రామస్తులు తెలిపారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోలీసులు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.